మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

**ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**

**దేవరకద్ర, మే3 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధి పొందిన కుటుంబాలకు, ఎమ్మెల్యే కుటుంబం తరపున ఎమ్మెల్యే జిఎంఆర్ నూతన వస్త్రాలు బహూకరించారు. కౌకుంట్ల మండలం, ముచ్చింతల గ్రామంలో ఆరు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇళ్ల నిర్మాణంతోపాటు లబ్ధిదారుల జీవనోపాధి మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే జిఎంఆర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ముచ్చింతల సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, కురుమూర్తి చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# నీట్ ప్రశాంతం

- 4141 అభ్యర్థులు హాజరు
- గైర్హాజరైన 73 మంది అభ్యర్థులు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 3 ప్రభాత వార్త :** మహబూబ్‌నగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి నీట్ (నీట్ యూజీ ) మెడికల్ ప్రవేశ పరీక్ష ఎలాంటి అవాంతరాలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలో మొత్తం 4,214 మంది అభ్యర్థులకు గాను వారిలో 4,141 మంది పరీక్షకు హాజరయ్యారు. 73 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. స్థానిక సంస్థఅదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం నీట్ పరీక్ష జరుగుతున్న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల , ఎంవిఎస్ డిగ్రీ కళాశాల , ప్రభుత్వ మోడల్ బేసిక్ హై స్కూల్ లలో గల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.పరీక్షల నిర్వహణ పరిశీలించి సూచనలు చేశారు.


పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**నీట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన రెవెన్యూ అదనపు కలెక్టర్ :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలను, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ మహబూబ్ నగర్ అర్బన్ తహసీల్దార్ తో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశ సమయంలో కట్టుదిట్టమైన భద్రత చర్యల మధ్య పరీక్షా ప్రశాంతంగా ముగిసింది. బయోమెట్రిక్ హాజరు నమోదు నిర్వహించడం, అడ్మిట్ కార్డ్ ధృవీకరణ, ఫోటో ఐడికార్డ్ తనిఖీ, అభ్యర్థులను తనిఖీ చేసి నిషేధిత వస్తువులు పరీక్షా కేంద్రంలోకి తీసుకు రాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కెమెరా,పర్యవేక్షణ ,భద్రతా ఏర్పాట్లను గావించారు.విద్యార్థులకు త్రాగు నీరు,వైద్య సదుపాయం మెడికల్ క్యాంప్, నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

**'నీట్' కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డి. జానకి**

**మహబూబ్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** నీట్ (యూజీ ) ప్రవేశ పరీక్ష సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా నందు ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ మహిళా కళాశాల పరీక్షా కేంద్రంలో బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.జానకి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా జడ్చర్లలోని ఒక కేంద్రం సహా మొత్తం 12 పరీక్షా కేంద్రాలలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు, పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. ఆదివారం జరుగుతున్న నీట్ (యూజి) పరీక్ష సందర్భంగా సంబంధిత కేంద్రాన్ని స్వయంగా పరిశీలించి, ఏర్పాట్లపై అధికారులకు తగిన సూచనలు చేసినట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఎస్పీ వెంట టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.


నీట్ కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ డి. జానకి




# కాంగ్రెస్ నాయకుల బెదిరింపులు

## బాధితుల ఆవేదన

3



మహబూబ్‌నగర్ పట్టణంలో తమ సొంత ఆస్తి విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తమను ఇబ్బందులకు ,భయబ్రాంతులకు గురి చేస్తున్నారంటూ బాధితులు ఆరోపించారు. ఈ మేరకు న్యూ టౌన్‌లోని బుక్ స్టాల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు ఆనంద్ కాటేగర్ కుటుంబ సభ్యులు తమ ఆవేదనను తెలిపారు.

# నేటి నుంచి రైతు వారోత్సవాలు

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహణ
- ఈ నెల 9 వరకు ప్రత్యేక కార్యాచరణ
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా





**మహబూబ్‌నగర్, మే 3, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేటి నుండి (మే 4 వ తేదీ) నుండి మే 9 వరకు రైతు వారోత్సవం నిర్వహించి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. రైతు వారోత్సవం లో భాగంగా మొదటి రోజు నేడు( మే 4 వ తేదీ)నేల ఆరోగ్య పరిరక్షణ, సమతల ఎరువుల యాజమాన్యం ప్రకృతి వ్యవసాయం, మే 5ఉద్యాన పంటల సాగు ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల ప్రత్యామ్నాయ పంటల సాగు, మే 6 బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక వంట రుణాలు సహకార సంఘాలు ఎఫ్‌పిఓ ల ద్వారా రైతులకు సేవలు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు,మే 7 వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలుపిఎం కుసుమ్ వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్స్ మే 8న పశుసంవర్ధక శాఖ,పాడి పరిశ్రమ పశు జాతి అభివృద్ధి, దూడల ప్రదర్శన, గడ్డి విత్తనాలు వేసవిలో పశు సంరక్షణ,మత్స్య శాఖ ద్వారా చెరువులలో కలుపు మొక్కల నివారణ, వ్యాధుల నియంత్రణ,అధికోత్పత్తికి చర్యలు, నీటి పారుదల శాఖ ద్వారా సమర్థ నీటి విడుదల కొరకై గేట్ల నిర్వహణ, ఎతి పోతల పథకాల మరమ్మత్తులు, కాలువలలో కంపచెట్లు గుర్రపు డెక్క తొలగింపు,మే 9 నీటిపారుదల శాఖ ద్వారా చెరువులలో కంపచెట్లు, గుర్రపు డెక్క తొలగింపు, సమతుల్య నీటి వినియోగం, కార్యాలయాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ వారీగా ప్రతి రోజు ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రైతులను భాగస్వామ్యులను చేస్తూ వ్యవసాయ శాఖ,ఉద్యాన శాఖ,మత్స్య శాఖ, నీటి పారుదల శాఖ, పశు సంవర్ధక శాఖ, సహకార శాఖలు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.













# ఇక పై డివిజన్ స్థాయిలో ప్రజావాణి

- నేటి నుండి ప్రారంభం
- డివిజన్ స్థాయి అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలి
- జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి ఇది కొనసాగింపు
- డివిజన్ పరిధిలోని ప్రజలు వారి సమస్యలను ఆర్‌డిఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో సమర్పించవచ్చు
- మహబూబ్‌నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా వెల్లడి



**మహబూబ్‌నగర్ బ్యూరో, మే3 ప్రభాతవార్త:** ఇక పై ప్రతి సోమవారం ఆర్‌డిఓ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయి ప్రజావానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్‌డిఓలను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక పై ప్రతి సోమ వారం ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు.డివిజన్ సాయి ప్రజావాణి కార్యక్ర మానికి రెవెన్యూ డివిజనల్ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలోని డివిజనల్ అధికారులు అందరూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు.డివిజనల్ పంచాయతీ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్ఓ, వ్యవసాయ సహాయ సంచాలకులు, డిస్కాండీఈలు, ఆర్అండ్‌బి,ఆర్‌డబ్ల్యుఎస్,హౌసింగ్ డిఈఈలు, సీడీపీవోలు, సహాయ ఎస్‌సి,ఎస్‌టి,బిసి అభివృద్ధి అధికారులు, డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు.జిల్లా అధికారులందరూ వారిశాఖకు సంబంధించిన అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.



2కె,5కె,10కె విభాగంలో పాల్గొన్న రన్నర్స్

## ఉత్సాహంగా పాలమూరు రన్..

- పాలమూరు రన్ విజయవంతం
- హుషారుగా పాల్గొన్న 600 పైగా రన్నర్స్

3






## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**శ్రీరంగాపూర్, మే 3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఆదివారం జ్యోతిరావు పూలే చౌరస్తా నుండి బైకు ర్యాలీగా వెళ్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి ప్రారంభించారు. తుడి మెగారెడ్డి మాట్లాడుతూ రైతులకు సరైన ధరలు అందేలా ఎలాంటి ఇబ్బందులు లేకుండాధాన్యం కొనుగోలు జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని రెడ్డి , వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రెడ్డి చర్ల శ్రీహరి, రాజశేఖర్ రెడ్డి, వనపర్తి జిల్లా మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, రాములు యాదవ్, రామచందర్, రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పండి

**ఆత్మకూర్ మే 3, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన విధంగా కార్మికులు బుద్ధి చెప్పాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం రోజు ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాల కోసం అమెరికా నగరంలోని చికాగోలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడమే కాకుండా కార్మికులకు కనీస భద్రత లేకుండా చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోర్డు తేవడం మూలంగా దేశవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్రలు పందుతుందని రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికుల పక్షాన నిలబడతామంటూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి కార్మికులకు భద్రత లేకుండా చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల పండుగగా భావించే మేడేస్ పూర్తితో కార్మికులు తమ హక్కులను సాధించుకునేందుకు ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు మరియురైతు కూలీలుఉపాధి హామీకూలీలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న దృశ్యం

**కోయిలకొండ మే 3, ప్రభాతవార్త:** కోయిలకొండ మండలం కొత్తలాబాద్ గ్రామంలో ఆదివారం వరి కొనుగోలు కేంద్రాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై విద్యాసాగర్ గౌడ్, గ్రామ సర్పంచ్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతు చెంతకే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతు కష్టాలు తీర్చడం జరిగిందన్నారు. గ్రామంలోని రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా వరి కొనుగోలు కేంద్రాలకే తెచ్చి విక్రయించుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతు పండించిన పంటకురాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్య క్రమంలో మాజీ ఎంపిటిసి సత్తయ్య గౌడ్, ఉప సర్పంచ్ క్రాంతి కుమార్ రెడ్డి, నాయకులు శ్రీశైలం, కనకయ్య, సాయిరాం గౌడ్, భీమయ్య, శ్రీనివాసులు, రాంభూపాల్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానాకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్



**కెటిదొడ్డి మే 3, ప్రభాతవార్త:** గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కెటిదొడ్డి మండలం పరిధిలోని నందిన్నె గ్రామంలో సంత బజార్ దగ్గర గ్రామ సర్పంచ్ బోయ నాగమ్మ, ఉపసర్పంచ్ పుష్ప,వార్డు సభ్యుల తో కలిసి పల్లె దవాఖానా కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..నందిన్నె గ్రామం అభివృద్ధి కొరకు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నందిన్నే ప్రకాశ్ రావు సహకారం తో మన గ్రామానికి పల్లె దవాఖానా రావడం తో గ్రామ ప్రజలుసంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌బోయ నాగమ్మ వెంకటేష్ ,ఉపసర్పంచ్ పుష్పతాయిరెడ్డి,వార్డు సభ్యులు, ఆటోవెంకన్న, డ్రైవర్ వీరన్న, డీలర్ రాంబాబు, మహాదేవ్ నందిన్నె నాగేష్ ,కాంట్రాక్టర్,గ్రామ పెద్దలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

**సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : కాంగ్రెస్ నాయకులు**

**నర్వ, మే 3 ప్రభాతవార్త:** పేదలందరికీ సొంత ఇంటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్,ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి.కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నర్వ మండలంలోని నాగి రెడ్డి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కోటరాణి చంద్రన్న నూతన ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ అంకె భాగ్యమ్మ చంద్రశేఖర్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తెలంగాణ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి సహకారం తో సొంతిల్లు లేని ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లును ఇస్తామన్నారు. ఇంకా ఎవరైనా ఇల్లు రాని వారు ఉంటే రెండవ విడతలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజా ప్రభుత్వం లో సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూస్తున్నామన్నారు. అనంతరం ఇంటి యజమానులకు నూతన వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బీసం రామకృష్ణ, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి అశోక్‌గౌడ్, డైరెక్టర్ మార్క నరేష్ ,గ్రామ ఉపసర్పంచ్ మొగిలిన్న, నర్వ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్దల ఆంజనేయ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, బి.నరసింహ,శ్రీకాంత్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, సురేష్,రవి కుమార్, గ్రామ వార్డు మెంబర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి నూతన వస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

## సిపిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

◆ సిపిఎస్‌ను రద్దు చేయాలి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి ◆ టీజీ సీపీఎస్ఈయు రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి

**లింగాల,మే 3,ప్రభాతవార్త: సిపిఎస్** రద్దు చేయాలి, ఓపిఎస్ ను పునరుద్దించడంతో పాటు సీపీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొని వచ్చినట్లు టీజీ సీపీఎస్ఈయు రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి తెలిపారు. ఆదివారం టీజీ సీపీఎస్ఈయు రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి మాట్లాడుతూ సీఎంఓ పిలుపు మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాష్ట్ర ఉద్యోగ సంఘాల జేఏసీ,రాష్ట్ర ఎంప్లాయిస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నాయకులతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అయినట్లు తెలిపారు. ఈ భేటీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నారన్నారు. సిపిఎస్ ఉద్యోగుల తరపున టిజీ సిపిఎస్ఈ యు రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి, టీజీఈ జెఏసి చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జాక్ నాయకులు పాల్గొన్నట్లు వెల్లడించారు. సిపిఎస్ రద్దు చేయాలని ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ పలు సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించినట్లు తెలిపారు. పదవీ విరమణ పొందిన సీపీఎస్‌ఉద్యోగుల పిఆర్ఏఎన్ అకౌంట్‌లో ఫైనల్ పేమెంట్ సెటిల్మెంట్ జరగకపోవడం తో వారికి రావాల్సిన పెన్షన్ బెనిఫిట్స్ పెన్షన్ రావడం లేదని వాటిని వెంటనే పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. సీపీఎస్ ఉద్యోగులు చెల్లించే 10 శాతం సీపీఎస్



కాంట్రిబ్యూషన్‌తో పాటు ప్రభుత్వం చెల్లించే 10 శాతం సీపీఎస్ కాంట్రిబ్యూషన్ సకాలంలో చెల్లించుట గురించుట గూర్చి వివరించినట్లు వెల్లడించారు. సీపీఎస్ ఉద్యోగులకు కరువు భత్యం వాయిదాలలో కాకుండా ఏక మొత్తంగా చెల్లించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే 10శాతం సీపీఎస్ కాంట్రిబ్యూషన్ ను కేంద్ర ప్రభుత్వ గజెట్ నోటిఫికేషన్ ప్రకారం 14 శాతంకు పెంచుట గురించి వివరించడం తో వివిధ డిమాండ్ల తో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్ర లలో సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించారని విషయాన్ని తెలిపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టీజీ సిపిఎస్ఈ యు గౌరవ అధ్యక్షులు రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు దర్శన్ గౌడ్‌లు పాల్గొన్నట్లు తెలిపారు.

## రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్.దేశ్యనాయక్**

**అచ్చంపేట, మే,3 ప్రభాతవార్త :** రైతులకు వ్యవసాయ మార్కెట్ లో కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దేశ్య నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ లో సీసీ బెడ్ లేక ధాన్యం ఆరేయడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తెచ్చి మూడు రోజులైనా ఎవరు పట్టించుకోవడంలేదని, సరిపడా గన్ని బ్యాగులు ఇవ్వక స్వయంగా మేమే కొని తెచ్చుకున్నామని రైతులు ఆరోపించారు. కనీసం తాగడానికి మంచి నీళ్లు దొరకడం లేదని, మహిళా రైతులకు టాయిలెట్స్ లేవని, అన్నారు. ప్రభుత్వం పేరుకు మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని, సౌకర్యాలు కల్పించడం



రైతు సమస్యలను అడిగి తెలుసుకున్న సిపిఎం నేతలు

మర్చిపోయారనీ ఆరోపించారు. రైతులను పట్టించుకోకపోతే రైతుల తరపున ఆందోళన చేయడానికి సిపిఎం పార్టీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎస్.వెంకటయ్య, రైతు సంఘం నాయకులు జి.పర్వతాలు, వాల్యా నాయక్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇల్లు

**ఆత్మకూర్ మే3, ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి సహకారంతో మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మింప చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు తదితరులు తెలిపారు. ఆదివారం రోజు పట్టణంలోని ఐదవ వార్డులో పలువురు ఇందిరమ్మ గృహాలను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలో 300 ఇందిర మైండ్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయని రెండవ విడతలో రాష్ట్ర మంత్రి వాకిశ్రీహరి సహకారంతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరిని గుర్తించి అర్హులైన అందరికీ ఇండ్లు నిర్మింపజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు మాటాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల కోసం ఇసుక సమస్యను ఎదుర్కొంటున్న లబ్ధిదారులకు తక్షణమే మంత్రి వాకిడి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ఇప్పటికే అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో అంతర్గత రహదారులు మరియు ప్రధాన అర్హదా



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నాగమణి

రులను ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దండు శ్రీనివాసులు, సద్దల తులసివెంకట్ రాములు,కోట్ల తిరువతయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్, అజ్మతుల్లా తదితరుల తో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదో తరగతి, ఇంటర్ పాసైన విద్యార్థులకు గ్రామాభిమాన సత్కారం

◆ విద్యార్థులందరూ ఉన్నత శిఖరాన్ని చేరుకోవాలి

◆ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

**మక్తల్ టౌన్, మే 3 ప్రభాతవార్త :** మక్తల్ మండలంలోని మాధ్వార్ గ్రామంలో విద్యా ప్రాధాన్యతను ప్రతిబింబించే విధంగా గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఘనంగా అభినందన సన్మాన సభ నిర్వహించారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో విజయాన్ని సాధించిన సుమారు 50 మంది విద్యార్థులను శాలువాలతో సత్కరించి, ప్రోత్సాహకంగా రామకృష్ణ మఠం వారు ప్రచురించిన మేలుకో నేస్తమా" అనే పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్ కెరీర్‌పై సమగ్ర మార్గదర్శకత్వం అందించారు. పదవ తరగతి ఇంటర్ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులపై అవగాహన కల్పిస్తూ, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమైన నైతిక విలువలు, మంచి అలవాట్లు, సానుకూల దృక్పథం, మంచి స్నేహితుల ప్రాధాన్యతను వివరించారు. లక్ష్య సాధనకు ఆత్మ విశ్వాసం ముఖ్యమని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా కవి కాళోజీ నారాయణరావు పుట్టుక నీది, చావు నీది, బ్రతుకంత దేశానిదే" అనే స్ఫూర్తిదాయకమైన మాటలను గుర్తు చేస్తూ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని



పదవ తరగతి టాపర్లను సన్మానిస్తున్న దృశ్యం

విద్యార్థులను ప్రేరేపించారు. గ్రామ పెద్దలు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ, ఉన్నత విద్య కోసంఅవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. భారత భాగ్య విధాత బాబాసాహెబ్ జీవితం - కార్యాచరణ"అనే పుస్తకాన్ని విద్యార్థులకు బహుమతిగా అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ రిటైర్డ్ హెచ్ఎంజగదీష్ కుమార్, జంగం బసవరాజ్, పాఠశాల హెచ్ఎం వెంకట్రాములు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు,ఉపసర్పంచ్ శివాని,డాక్టర్ ఆశప్ప,బాట నరసింహ, గణపురం నగేష్, కురువ మల్లేష్, బాట జయమ్మ, గుడిసె తిమ్మయ్య, గాల్లరాములు,బిచ్చలి బ్యాంకు నర సింహ, పంచాయతీ కార్యదర్శి నస్లాయితిమ్మయ్య నస్లాయి, నాగరాజు,ఆర్ఎంపీ రామకృష్ణ, శివపుల్ల లక్ష్మయ్య, వడ్ల భానుప్రసాద్, బుడబోయి చంద్రప్ప,పోలీస్ లక్ష్మారెడ్డి గుడిసెరాజు,బాటరాజు,బాట బీమప్ప, జంగం నరసింహులు తదితరులు, గ్రామ యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేతికొచ్చిన మొక్కజొన్న పంట దగ్ధం

**బిజినపల్లి, మే 3 ప్రభాతవార్త :** మూలిగే నక్క పై తాటికాయ పడ్డ చిన్నంగా తయారైంది ఆ రైతన్న పరిస్థితి. ఆరుగాలం శ్రమించి చేతి కొచ్చిన మొక్కజొన్న పంట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెలువడ్డ నిప్పు రవ్వలు అంటుకొని దగ్ధమైన సంఘటన అల్లిపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన డొక్కా శ్రీనివాసులు సాగుచేసిన మొక్కజొన్న పంట పక్కనే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఉండడంతో ట్రాన్స్ ఫార్మర్ నుంచి వెలువడ్డ నిప్పు రవ్వలు ఒక్కసారిగా మొక్క జొన్న పంటకు నిప్పంటుకోవడంతో సాగుచేసిన 2.10 గుంటల భూమి లోని పంట పూర్తిగా దగ్ధమైంది. సంఘటనను గమనించిన చుట్టుపక్కల రైతులు బాధిత రైతుకు సమాచారం అందించడంతో పంట వద్దకు చేరుకొని కన్నీటి పర్యంతమయ్యాడు. గత కొన్ని రోజులుగా ట్రాన్స్ ఫార్మర్ నుండి నిప్పురవ్వలు వెలువడడాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించిన పట్టించుకోలేదని వాపోయాడు. కాలి బూడిదైపోయినా పంట దాదాపు రెండు



పూర్తిగా దగ్ధమైన మొక్కజొన్న పంట

లక్షల వరకు ఉంటుందని ఆవేదన వెలిబుచ్చారు. విద్యుత్ అధికారుల నిరక్ష్యం వల్లే పంట పూర్తిగా దగ్ధమైందని భావిత రైతుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని తోటి రైతులు, సర్పంచ్ జంగిటి కోటేశ్వర్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, మాజీ సర్పంచ్ మల్లికార్జున్, గ్రామస్తులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నారాయణపేట, మే 3 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల జిహెచ్ఎస్‌లో 2006,2007 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు విజయరామారావు, వెంకటయ్య, బాలప్ప, వీరయ్య, సుజాత, రాధాహజారై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమను తీర్చిదిద్దిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. సమ్మేళనంలో భాగంగా పాఠశాల అభివృద్ధికి తోడ్పడే అంశాలపై చర్చించారు. పేద విద్యార్థులకు సహాయం చేయాలని నిర్ణయించారు. అనంతరం కలిసి భోజనం చేసి, ఫోటో



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

లు దిగుతూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భం గా 2026 సంవత్సరానికి చెందిన 10వ తరగతి ప్రతిభావంతులైన విద్యార్థులు కే.వైశాలి (554), అరవింద్ (505)లను సన్మానించారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే సమావేశం నిర్వహించుకోవాలని నిర్ణయించారు.

## బాల్యవివాహాలు నేరం

◆ **నారాయణపేట జిల్లా ఎస్పీ డా. వినీత్**



**నారాయణపేట, మే3 ప్రభాతవార్త :** జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డా. వినీత్ పిలుపునిచ్చారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని 18 సంవత్సరాల లోపు బాలికలు,21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం జరపడం నిషేధించబడింది అని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు బాలల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటువారి విద్యను మధ్యలోనే నిలిపివేస్తాయని తెలిపారు. ముఖ్యంగా బాలికల భవిష్యత్తు, ఆర్థిక స్వావలంబన,ఆరోగ్య భద్రతపై తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని బాల్య వివాహాలను నిరోధించడంలో ముందుండాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండి, బలవంతపు వివాహ ప్రయత్నాలను వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు,మహిళా సంఘాలు,స్వచ్ఛంద సంస్థలు కలిసి గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బాల్యవివాహం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్, డయల్ 100లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. బాల్య వివాహాలకు చెక్ బాలల భవిష్యత్తుకు సెక్యూర్" అనే సందేశాన్ని సమాజానికి అందించారు.

## నేటి ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి

**ఉప్పునుంతల,మే3 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని తహసీల్దార్ అద్దంకి సునీత సూచించారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలనుప్రజావాణిలో విన్నవించుకునే అవకాశం కల్పించినందున అన్ని విభాగాల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె తెలిపారు. ఇప్పటి వరకు కొన్ని శాఖల అధికారులు మాత్రమే ప్రజావాణి కార్యక్ర మానికి హాజరవుతున్నారని, ఇకనుంచి ప్రజావాణికి హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని ఆమె పేర్కొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు



పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

**నారాయణ పేట, మే 3 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఊట్కూర్ వేసవికాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉపసర్పంచ్ ఆర్. రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎం. భరత్ తెలిపారు. ఊట్కూర్ మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కొత్త కాలనీలో నూతన పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని 16 వార్డుల్లో తాగునీటి సమస్యలు రాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. శ్రీరామ్ నగర్ కొత్త కాలనీలో నీటి కొరత తీవ్రంగా ఉండడంతో సమస్యను పరిష్కరించేందుకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అవసరమైన ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, తడి పొడి చెత్తను వేర్వేరుగా సేకరణ వాహనాల్లో వేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలసహకారంతో గ్రామాభివృద్ధికి కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. యువతకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించడం వల్ల సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. నూతన పైప్‌లైన్ పనులు ప్రారంభించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొక్కు మౌనిక లక్ష్మణ్, భరత్, నాయకులు భక్తి తిమ్మప్ప, వెంకట్ రాములు,శ్రీనివాస్, నరసింహ, బలరాం, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో పశువుల అక్రమ రవాణా తనిఖీ కేంద్రం ఏర్పాటు



పశువుల అక్రమ రవాణా చేయకుండా తనిఖీ కేంద్రం ఏర్పాటు చేసిన పోలీసులు

**బాలానగర్ మే 3 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ముందు 44వ జాతీయ రహదారిపై జిల్లా ఎస్పీ డీ.జానకి ఆదేశాల మేరకు బక్రీదు పండుగ సందర్భంగా పశువులను అక్రమంగా తరలించకుండా ఎస్సై లెనిన్ ఆదివారం తనిఖీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనుమతులు లేకుండా పశువులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పశువులను తరలించే వాహనదారులు తప్పనిసరిగా అనుమతి పత్రాలు పొందినతర్వాతే పశువులరవాణా చేయాలన్నారు. ఈ తనిఖీలలో బాలానగర్ స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే



**దేవరకద్ర, మే 3 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం వెంకంపల్లి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆల ప్రతాపరెడ్డి నూతన గృహప్రవేశం, వాస్తు పూజ కార్యక్రమంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. గృహ యజమానులు ఆలా ప్రతాపరెడ్డి దంపతులను అభినందిస్తూ, వారి కొత్త ఇంటిలో సుఖశాంతులు ఐశ్వర్యం నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలా ప్రతాపరెడ్డి కుటుంబ సభ్యులతో సన్నిహితంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కేబీఆర్ గౌడ్, కురువ రవి, నరేందర్ గౌడ్, వెంకంపల్లి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

**దేవరకద్ర, మే 3 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం, వెంకంపల్లి గ్రామంలో కె.తిరుపతిరెడ్డి వారం రోజుల క్రితం చనిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి పరిస్థితిని తెలుసుకొని ధైర్యం చెప్పారు. ధైర్యంగా ఉండండి నేను మీతోనే ఉన్నాను అంటూ వారికి భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట కౌకుంట్ల మండల అధ్యక్షులు కేబీఆర్ గౌడ్, కురవ రవి, రాజోలి మాజీ సర్పంచ్, నరేందర్ గౌడ్ ఓబీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్, బిఎస్పీ పార్టీ నాయకులు



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బిఆర్ఎస్,బిఎస్పీ పార్టీల నాయకులు

**శ్రీరంగాపూర్, మే3 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన బహుజన సమాజ్ పార్టీ నాయకులు కేశపాగ నాగేష్, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు జమ్మన్నగారి లక్ష్మణ్‌లను ఎమ్మెల్యే తూడిమేగారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాము రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి అభివృద్ధిని చూసి వనపర్తి నియోజకవర్గంలో తుడిమేగా రెడ్డి చేస్తున్నటువంటి సేవలను చూసి మేము స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని ఇక ముందు నుండి మేము కాంగ్రెస్ పార్టీ కోసం పార్టీ ఆదేశాలు పాటిస్తూ పనిచేస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడీ మెగా రెడ్డితో పాటు శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హజ్ యాత్రికులకు సన్మానం



హజ్ యాత్రికులను సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, మే 3 ప్రభాతవార్త:** స్థానిక పట్టణంలోని రహమత్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ యజమాని ఎండి రఫీక్, వారి తండ్రి పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా మక్తల్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ పవిత్ర యాత్రకు వెళుతున్న తండ్రీ కొడుకులను అభినందిస్తూ, వారి ప్రయాణం సుఖమయంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ అసోసియేషన్ సభ్యులు కొండా విజయ్ కుమార్, ఖాజా మైనుద్దీన్, నాగేందర్ గుప్తా, డి.సుధాకర్, అశోక్ కుమార్, మధుసూదన్ రెడ్డి, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు. యాత్రికులకు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో చేసే హజ్ యాత్ర అందరికీ క్షేమదాయకంగా ఉండాలని, సమాజంలో శాంతిసౌభ్రాతృత్వాలు వర్ధిల్లాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమం పట్ల ఎండి రఫీక్, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దేవాలయాలు గ్రామ ఐక్యతకు కేంద్ర బిందువులు



ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, మే 3 ప్రభాతవార్త:** దేవాలయం అంటే కేవలం పూజ స్థలం కాదు గ్రామ ఐక్యతకు కేంద్ర బిందువులని అందుకే గ్రామాల అభివృద్ధితో పాటు ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని కోట్ర గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠ మహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై దేవాలయంలో నిర్వాహకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రెండు లక్షల 80 వేల రూపాయలతో దేవాలయానికి అవసరమైన పెయింటింగ్ ను అందించారు. రాఘవేందర్ రెడ్డిని నిర్వాహకులు శాలువాలతో ఘనంగాసన్మానించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగరాజుగౌడ్, అంజయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, సాయిలుగౌడ్, మల్లయ్య గౌడ్, నగేష్ గౌడ్, సైదులుగౌడ్, సిద్దయ్య గౌడ్, జంగయ్య గౌడు, శ్రీనివాసులు గౌడు, లక్ష్మయ్య తోపాటు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట బిజెపి నాయకుల ధర్నా

**నవాబుపేట, మే 3 ప్రభాతవార్త:** మండలం మరికల్ పంచాయతీ పరిధిలో తంగేళ్లపల్లి గ్రామంలో గత నెల ఏప్రిల్ 30వ తేదీన ఉదయం 7 గంటల సమయంలో దళిత క్రిస్టియన్ పై కొందరు యువకులు దాడిచేసి ఇంటి కిటికీలు తలుపులు పగలగొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చి వివాదాస్పదమైంది. ఈ ఘటనలో నిజానిజాలు బయటపెట్టాలని లావణ్య అనే మహిళ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కాగా క్రిస్టియన్లు మత ప్రచారంపై జరిగిన ఘర్షణతో బిజెపి నాయకులు ముచ్చర్ల జనార్ధన్, మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ గణేష్ చారి ఆధ్వర్యంలో నాయకులు భజరంగ్‌దళ్ కార్యకర్తలు మండల హిందూ సంఘాల నాయకులు పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై ధర్నా చేయడంతో కాసేపు మండల కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. సిఐ గాంధీ నాయక్‌కు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, గత నెల ఏప్రిల్ 30వ తేదీన ఉదయం తంగెళ్లపల్లి గ్రామంలో క్రిస్టియన్ మతస్తుల





పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న భజరంగ్‌దళ్ నాయకులు



ఎస్సైపై సిఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మత ప్రచారాన్ని గ్రామ యువకులు అడ్డుకున్నారు. దీంతో వారు మత ప్రచారానికి వ్యతిరేకంగా ఉన్న యువకులకు దళిత క్రిస్టియన్‌లకు మధ్య చిన్న వివాదానికి దారి తీసి, గ్రామంలోని యువకులు దళిత క్రిస్టియన్లపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న నవాబుపేట ఎస్సై విక్రమ్ దళితుడిపై, అతని ఇంటిపై దాడి చేసి గాయపరిచిన యువకులపై కేసులు నమోదు చేశారు. అయితే క్రిస్టియన్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదులో లావణ్య అనే మహిళ ఆరోపించారు. గ్రామంలో మత ప్రచారానికి సంబంధించి గతంలో ఎలాంటి సమస్యలు లేవని, కావాలనే కొందరు గ్రామంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఎస్సైపై సీఐ గాంధీ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలు నిగ్గు తేల్చాలని గ్రామస్తులు, హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## నిరుద్యోగాన్ని రూపుమాపుదాం!

### శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**వెల్దండ, మే 3 ప్రభాతవార్త :** విద్యలో ప్రతిభ ఉండి ఆర్థిక స్థోమత లేక ఎందరో విద్యార్థులు వెనుకబాటుకు గురవుతున్నారని ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి నేనున్నానని భరోసా ఇస్తున్నారు సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి.మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఆరవ ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశాల కొరత వల్ల వారి లక్ష్యాలు మధ్యలోనే ఆగిపోతున్నాయని డబ్బు లేక చదువు ఆగకూడదు కోచింగ్ లేక ఎంచుకున్న లక్ష్యాలకు దూరం కాకూడదు అనే సంకల్పంతోనే ఈ ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని శిక్షణా కేంద్రంలో విద్యార్థులకు సబ్జెక్టు బోధనతో పాటు స్టడీ మెటీరియల్ ఫిజికల్ ట్రైనింగ్ పరీక్షల ప్రిపరేషన్ అందిస్తామని పోలీస్ ఉద్యోగం సాధించాలంటే క్రమశిక్షణ శ్రమ నిబద్ధత అవసరమని శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని అభ్యర్థులకు సూచించారు. సందర్భంగా రాఘవేందర్ రెడ్డికి విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచులు గన్యానాయ రవీందర్ నాయక్,రమేష్‌నాయక్, ఉపసర్పంచ్ విజయ్, నాయకులు నారాయణ నాయక్, పంతుల నాయక్ తోపాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఒకే కుటుంబంలో ఏడుగురు స్కూల్ ఫస్ట్

**చిన్నంబావి మే 3 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదివి ర్యాంకులు సాధించడం కొందరికే సాధ్యం కాని ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముల పిల్లలు పోటాపోటీగా ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతూ... పాఠశాల మొదటి ర్యాంకులు సాధించడం గొప్ప విషయం ఈ సంఘటన వనపర్తి జిల్లా చిన్నం బావి మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలో జరిగింది. గ్రామానికిచెందిన పూసలపాటి బాలచందర్, పూసలపాటి కురుమయ్యలు వృత్తిరీత్యా తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తూ సెంటు భూమిలేని నిరుపేద కుటుంబం చదువుల సరస్వతి తన ఇరువురి అన్నదమ్ములకు కుటుంబ భారంతో పదవ తరగతితోనే విద్యను నిలిపివేసి తాపీ మేస్త్రీ జీవనం సాగిస్తూ సరిపెట్టుకోవడం జరిగింది. తాము పడ్డ ఇబ్బందులు తమ పిల్లలు పడవద్దని, వారిని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివిస్తూ... ఉన్నత విలువలతో.. విద్యను అభ్యసించే విధేయులుగా వారి పిల్లలు తయారు కావడం గొప్ప విషయం.పెద్ద దగడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2014,15 బ్యాచ్ లో ఇరువురి అన్నదమ్ముల పిల్లలు ప్రణవ్, మౌనికలు పోటాపోటీగా చదివి ఒకే ర్యాంకుతో పాఠశాల మొదటి ర్యాంకర్లుగా నిలిచారు. అన్న బాలచందర్ కుటుంబానికి చెందిన మరో అమ్మాయి ఝాన్సీ 2016,17 విద్యా సంవత్సరంలో అదే పాఠశాలలో మొదటి ర్యాంకర్ గా నిలిచింది. మళ్ళీ అదే బాలచందర్ కుటుంబానికి చెందిన మరొక అమ్మాయి చందు 2019,20 విద్యాసంవత్సరంలో పాఠశాల మొదటి ర్యాంకు సాధించడం జరిగింది. అదే కుటుంబానికి చెందిన తమ్ముడు కురుమూర్తి కూతురు ఇందు 2020,21 విద్యా సంవత్సరంలో పాఠశాల మొదటి ర్యాంకర్‌గా నిలిచింది. అదే వార్షిక సంవత్సరంలో కురుమూర్తి మరో కూతురు నారాయణపేట గురుకుల పాఠశాలలో 9.2 గ్రేడులో ప్రతిభ సాధించింది.మరోసారి 2025,26 లో అదే కురుమూర్తి కుటుంబానికి ర్యాంకులు సాధించే అవకాశం వచ్చింది.



స్కూల్ ఫస్ట్ ర్యాంకు సాధించిన విగ్నేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఈ వార్షిక సంవత్సరం 2025,26లో పూసలపాటి విగ్నేష్ పాఠశాల మొదటి ర్యాంకర్‌గా నిలిచారు.దీంతో వారి కుటుంబంలో ఉన్న ఇరువురు అన్నదమ్ముల మధ్య ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు పదవ తరగతి లో మొదటి ర్యాంకర్లుగా నిలవడం బహుశారాష్ట్రంలోనే గొప్ప విద్య కుటుంబంగా నిలిచింది. దీంతో వారి కుటుంబాన్ని ప్రతి ఒక్కరు అభినందించడం జరిగింది. వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ... తమకు దూరమైన విద్యను తమ పిల్లలకు దూరం కావద్దని, చదివే ధ్యేయంగా తమ పిల్లలు కష్టపడుతున్నారని, భవిష్యత్తులో వారు గొప్ప స్థాయిలోనిలవాలని ఆకాంక్షించారు.కాగా, మీ శ్రేయోభిలాషి ఫౌండేషన్, మండలం అంబేద్కర్ యువజన సంఘం, ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలోశనివారం సాయంత్రం పెరుమాళ్ళ శ్రీనివాస్ పూసలపాటి కుటుం బానికి చెందిన బాలచందర్, కురుమూర్తి, విగ్నేష్ ను, వారి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగ శేషు, ట్రాక్టర్ కురుమయ్య, బాలకృష్ణ, చెన్నకేశవులు, శ్రీనివాసులు, బాలచందర్, చిట్టెమ్మ, మాసమ్మ, శాంతమ్మ, వెంకటమ్మ, లక్ష్మమ్మ, కురుమూర్తి, గ్రామ అంబేద్కర్‌యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పది రోజులైనా పట్టించుకోరా..

- జాతీయ రహదారికి అడ్డంగా మట్టి పోయడంతో రాకపోకలకు ఇబ్బందులు



రహదారికి అడ్డంగా మట్టి పోసిన దృశ్యం

**మహబూబ్‌నగర్, మే3 ప్రభాతవార్త:** జాతీయ రహదారిని అడ్డంగా తవ్వి రోడ్డుపై మట్టి పోస్తున్న కనీసం అధికారులు పట్టించుకోని పరిస్థితి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పడింది. జాతీయ రహదారి చించోలి నుండి భూత్పూర్ వెళ్లే అమిస్తాపూర్ రహదారిలో రోడ్డుకు అడ్డంగా మట్టివేసి పది రోజులు గడిచిన జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టిని తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.

## చెరువులో పడి వృద్ధురాలి మృతి



మృతి చెందిన వృద్ధురాలు సాయమ్మ

**నర్వ, మే3 ప్రభాతవార్త:** కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధురాలు చెరువులో దూకి మృతి చెందిన సంఘటన ఆదివారం నారాయణపేట జిల్లా,నర్వ మండలము పాతేర్చెడ్ గ్రామం లో చోటు చేసుకుంది. నర్వ ఎస్.ఐ పబ్బతి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం పాతేర్చెడ్ గ్రామానికి చెందిన రోడ్డ పొల్ల సాయమ్మ అలి యాస్ కొత్తపల్లి సాయమ్మ (63)మే 1వ తేదీన గ్రామంలో జరిగిన శ్రీఆంజనేయ స్వామి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి గుడిలోనే నిద్ర చేస్తానని తన కుటుంబ సభ్యులకు తెలిపిందని కుటుంబ సభ్యులు మందలించి శనివారం వద్దు,మంగళవారం రోజు వెళ్ళమని సూచించారు. ఈ విషయంలో మనస్తాపానికి గురైన సాయమ్మ,మే 2వ తేదీ సాయంత్రం సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటికి వెళ్ళిపోవడం జరిగిందని,ఆమె గుడికే వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే ఆదివారం ఉదయం గ్రామంలోని చెరువులో ఒక గుర్తు తెలియని మహిళ శవం తేలుతున్నట్లు సమాచారం రావడంతో,సాయమ్మ కుమారుడు రోడ్డపొల్ల నరసింహులు అక్కడికి వెళ్లి చూడగా, అది తన తల్లి సాయమ్మ మృతదేహంగాగుర్తించాడు. గుడికి వెళ్లే విషయంలో గొడవ జరగడంతో మనస్తాపం చెంది సాయమ్మ చెరువు లో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని ఆయన తెలిపారు. నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ పబ్బతి రమేష్ వెల్లడించారు.

## ఫిల్టర్ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**నవాబుపేట, మే 3 ప్రభాతవార్త :** ట్రాక్టర్లో ఫిల్టర్ ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న నవాబుపేట పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆదివారం ఉదయం మండల పరిధిలోని చౌటపల్లి నుండి కొల్లూరు కు తరలిస్తున్న ఫిల్టర్ ఇసుక ట్రాక్టర్ ట్రాక్టర్ నెంబర్ టిఎస్ 06 ఎఫ్‌డి 8392 ను పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు అధికారులు సీజ్ చేశారు. ఇసుక ట్రాక్టర్ చౌటపల్లి గ్రామానికి చెందిన కోసూరు సత్యనారాయణదిగా గుర్తించి కేసు నమోదు చేశారు.

## నేడు మెగా రక్తదానం శిబిరం



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ ప్రశాంత్

**మదనాపురం, మే3 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం కొత్తకోట ఏటీఆర్ ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు మార్కెట్ చైర్మన్‌ప్రశాంత్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గం.లకు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. నియోజక వర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ తరలివచ్చి రక్తదానం చేసి, శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ చుక్క మహేష్, జిల్లా కార్యదర్శి వేమన్న, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కృష్ణవర్ధన్ రెడ్డి, కురుమూర్తి రాయల లిఫ్ట్ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి,మండలప్రధాన కార్యదర్శి జగదీష్,మండల నాయకులు వెంకటనారాయణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాములు, సర్పంచ్లుశారదరామకృష్ణ,ఆఫ్రిన్ బేగంఅంజద్‌అలీ, సత్య శీలారెడ్డి, సాయిబాబా, హనుమాన్ రావ్,రాములు తదితరులు పాల్గొన్నారు.

## పాపగల్ ప్రీమియర్ లీగ్ విజేత వారియర్స్ జట్టు



గెలుపొందిన వారియర్స్ జట్టు

**తాడూరు, మే 3 ప్రభాతవార్త:** తాడూరు మండలం పాపగల్ గ్రామంలోపాపగల్ ప్రీమియం లీగ్ సీజన్ 2 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. నాలుగు జట్లు పాల్గొనగా విన్నర్‌గా వారియర్స్ జట్టు నిలువగా, రన్నర్‌గా బుల్స్ టీంనిలిచింది. పోటీలో ఈగల్స్,బుల్స్,లయన్స్,వారియర్స్ జట్లుపాల్గొన్నాయి. వారియర్స్ జట్టు విన్నర్‌గా నిల్వగా బుల్స్ రెండో స్థానంలో నిలిచింది.

## కాంగ్రెస్ నాయకుల బెదిరింపులు

### బాధితుల ఆవేదన



మీడియా ద్వారా తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్న బాధితులు

**మహబూబ్‌నగర్, మే3, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణంలో తమ సొంత ఆస్తి విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తమను ఇబ్బందులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ బాధితులు ఆరోపించారు. ఈ మేరకు న్యూ టౌన్‌లోని బుక్ స్టాల్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో బాధితులు ఆనంద్ కాటేగర్ కుటుంబ సభ్యులు తమ ఆవేదనను తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీదేవి నుంచి డాక్యుమెంట్ నెంబర్ 14414/2024 ద్వారా ఆస్తిని చట్టబద్ధంగా కొనుగోలు చేసినట్లు చెప్పారు. అయితే రెండేళ్ల తర్వాత లీజు పేరుతో రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత మధుసూదన్ రెడ్డి కలిసి దాడికి పాల్పడి తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. బాధితుల వాదన ప్రకారం తమ చట్టబద్ధమైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రైవేట్ కుల సంఘాల నాయకులు, 59వ వార్డు కార్పోరేటర్ మహమ్మద్ తాహెర్ మద్దతుతో కుట్ర జరుగుతోందని తెలిపారు. ఈ క్రమంలో బెదిరింపులు, ఒత్తిళ్లు పెంచుతూ ఆస్తిని స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపించారు.ఇప్పటికే తమ ఫిర్యాదు మేరకు పోలీసులు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత మధుసూదన్ రెడ్డి, ఆమె వ్యక్తిగత సహాయకుడు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు బాధితులు వెల్లడించారు. అలాగే పట్టణ డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కబ్జాదారులకు మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తమకు న్యాయం చేయాలని బాధితులు మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు.

# ఉత్సాహంగా పాలమూరు రన్..

**జడ్చర్ల, మే 3 ప్రభాతవార్త :** తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో జడ్చర్లలో జరిగిన పాలమూరు రన్ విజయవంతం అయ్యింది. దాదాపు 600 పైగా రన్నర్స్ అన్ని వయసుల వారు హుషారుగా పాల్గొన్నారు. జుంబా వార్మప్ తో ప్రారంభం అయిన పరుగు పట్టణంలోని ముఖ్యమైన రహదారుల గుండా సాగింది. పరుగు తర్వాత డా.శివకాంత్ సిపిఆర్ డెమో ప్రదర్శించారు. 2కె,5కె, 10కె విభాగంలో పరుగు జరిగింది.ఈ రన్ ఉమ్మడి పాలమూరు జిల్లా వాసులతో పాటు హైదరాబాద్ కు చెందిన రన్నర్స్ కూడా పాల్గొన్నారు. పాలమూర్ జిల్లాలో తొలి సారిగా జరిగిన



2కె,5కె, 10కె విభాగంలో పాల్గొన్న రన్నర్స్





ఈ రన్ ప్రజలను విశేషంగా ఆకట్టుకోవడంతో నిర్వాహకులు తెలంగాణ రన్నర్స్, జడ్చర్ల రన్నర్స్ ప్రజలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా జూన్ 7వ తేదీన హైదరాబాద్ లో జరిగే తెలంగాణ రన్ లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రన్ లో జడ్చర్ల ఎస్సై ఖాదర్, డా.శివకాంత్, డా.దినేష్, తెలంగాణ రన్నర్స్ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, రవి సాంబారి తో పాటు నిర్వాహకులు రామకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నీట్ పరీక్షలు

### 3,404మంది అభ్యర్థులు హాజరు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 3, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 12 నీట్ పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంతంగ జరిగాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 12 నీట్ పరీక్షా కేంద్రాల్లో 3,468మంది అభ్యర్థులు పరీక్షలు రాయటానికి ఏర్పాట్లు చేయగా, వీరిలో పరీక్షలకు 3,404మంది అభ్యర్థులు హాజరు అయినట్లు, 64మంది పరీక్షకు గైర్హాజరు అయినట్లు నీట్ పరీక్షల సిటీ కోఆర్డినేటర్ ఇవి రమణ తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం-1లో నిర్వహిస్తున్న నీట్ పరీక్షా నిర్వాహణను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. ఆదివారం జిల్లాలోని ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం-1లో నిర్వహిస్తున్న నీట్ పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి నీట్ పరీక్షల నిర్వాహణను ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహణ ఏర్పాట్లపై కళాశాల యాజమాన్యాన్ని, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు మంచినీరు, కరంటు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల్లో మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని, పరీక్షలు ప్రశాంతంగ నిర్వహించాలని యాజమాన్యాలకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. ఈ పర్యటనలో మేడిపల్లి తహసీల్దార్ నర్సింహ్మారెడ్డి, కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా ఉప్పల్ కేంద్రీయ విద్యాలయంలో నీట్ పరీక్షా నిర్వహణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

**ఘట్‌కేసర్, మే 3, ప్రభాతవార్త:** ప్రభుత్వం రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమచేయాలని ఘట్‌కేసర్ మండల రైతు ఋణమాఫీ సాధన సమితి కన్వీనర్ కంట్లం గౌరీశంకర్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ పరిధిలో పండించిన వరిధాన్యం సేకరించేందుకు అధికారులు 4 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ చివరి నాటికి రైతుల ఖాతాలో 3వ విడత రైతుభరోసా డబ్బులు వేస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికి వేయకపోవడంతో రైతుల నుంచి వ్యతిరేకత వస్తుందని తెలిపారు. రైతులు ధాన్యం దిగుబడి చేసుకొని కళ్లాల్లో ఎండబోస్తున్నారని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవకపోవడంతో 30 శాతం దాకా ధాన్యం రైస్ మిల్లర్లకు వెళ్లిందని తెలిపారు. ఎదులాబాద్‌లోని తిరుమలయ్యబండ వద్ద ఎండలో రైతులు వడ్లు ఎండబోసి కాంటాలో విక్రయించేందుకు ఎదురుచూస్తున్నారని ఈసమయంలో వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి రైతాంగానికి నష్టం జరిగే ఆస్కారముందని ఆయన తెలిపారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో పంటఋణాలు పొందిన దాదాపు 1,200 మంది రైతులకు ఇప్పటివరకు ఋణమాఫీ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## వారంలోపే చెల్లింపులు

### ◆పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు ◆రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం ◆ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, మే 3, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శక విధానంతో చేపడుతున్నామని, రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో డిసిఎంఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజులలోపే రైతుల ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, తాండూర్ నియోజకవర్గ ఆత్మ ఛైర్మన్ శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ పట్లోళ్ల నర్సిములు, కోటపల్లి మార్కెట్ కమిటి ఛైర్మన్ అంజయ్య, వైస్‌ఛైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యాక్షులు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

### ⋆ఉదయం నుంచి భానుడి భగభగలు ⋆ఎండ తీవ్రతకు అలమటిస్తున్న మూగజీవాలు

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:** ఎక్కడ చూసినా భానుడి ప్రతాపంతో ఎండలు భగ్గుమని దంచి కొడుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలనుండే భానుడు తన ప్రతా పాన్ని చూపి స్తున్నాడు. దీంతో జనాలు ఉక్కు పోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 43, డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై జనాలను, మూగజీవాను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవ కాశం ఉందని వాతావరణ శాఖ సమాచారం. ఇట్టి ఉష్ణోగ్రత పలు జిల్లాలలో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చ రికలు జారీ చేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్టు జారీ చేసింది. రానున్న రోజుల్లో ఆయా జిల్లాలలో 41, నుంచి 45, డిగ్రీలు దాటే అవకాశాలు కూడా ఉన్నాయని సూచిస్తున్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో జనాలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. అయినా అకాల వాతావరణంతో ప్రజలు, మూగ జీవాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఎందుకంటే పగలంతా ఎండ తీవ్రత అత్యదిక ఉష్ణోగ్రతలు, అధిక వేడి,



సాయంత్రానికి ఉరు ములు మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం, ఆపై పిడుగులు పడి మూగ జీవాలు మృత్యు వాత పడుతున్నాయి.

ఇందుకు ప్రజలే వాతా వరణానికి అనుకూలంగా చూసి జాగ్రత పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అనుబవజ్ఞులు తమ అనుభవాలను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, ఎందుకంటే అందుబాటులో ఆసు పత్రులుండవు, రాత్రి పూట రవాణా సౌకర్యం లేకపోవడంతో మరీ ఇబ్బదులు ఎదుర్కోవలపిన పరిస్థితి ఏర్పడుతుంది. కావున ఈ వేసవి కాలాని కణుగూణంగా జాగ్రత్తలు తీసుకోవాలని సంభంధిత అధికారులు సూచిస్తున్నారు.



అడుగడుగునా

## రైతు భద్రతే లక్ష్యంగా..

### నేటి నుంచి రైతు వారోత్సవాలు

- సమతుల్య ఎరువుల యాజమాన్యం,
- పక్రృతి వ్యవసాయం
- దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు,
- సొసైటీల ద్వారా రైతులకు సేవలు,
- వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు తదితర అంశాలపై అవగాహన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 3, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4వ తేదీ నుంచి 9వరకు రైతువారోత్సవం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి కె.చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగ ఆమె మాట్లాడుతూ రోజు వారీగ నిర్వహించే రైతు వారం కార్యక్రమాలను వివరించారు. ఈ నెల 4న నేల ఆరోగ్యం పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం-ప్రకృతి వ్యవసాయం, అదే విధంగా ఫౌరసరపరాల శాఖ వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగుపై రైతు వేదికల్లో రైతులకు సంబంధిత అధికారులు వివరిస్తారని అన్నారు. ఈ నెల 5న ఉద్యాన పంటల సాగు- ఆయిల్ ఫామ్ సాగు, విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగుపై (కాన్సిట్యూఎన్సి స్థాయిలో) వివరిస్తారని ఆమె తెలిపారు. 6న బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పిఓల ద్వారా రైతులకు సేవలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు పై రైతు వేదికల్లో వివరిస్తారని తెలిపారు. 7న వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు-పిఎం కుసుమ్, వ్యవసాయ యంత్రీకరణ-డ్రోన్స్ (కాన్సిట్యూఎన్సీ స్థాయిలో) వివరిస్తారని అన్నారు. 8న పశు సంవర్ధక శాఖ,పాడి పరిశ్రమ, పశు జాతి అబివృద్ధి, దూడల ప్రదర్శన, గడ్డి విత్తనాలు-వేసవిలో పశు సంరక్షణ (మండల స్థాయిలో), మత్స శాఖ వారు చెరువులలో కలుపు మొక్కల నివారణ, వ్యాదుల నియంత్రణ, అధికోత్పత్తి చర్యలు వాటిపై, అదే విధంగా నీటి పారుదల శాఖ నుంచి సమర్ధ నీటి విడుదల కొరకై గేట్ల నిర్వాహణ, ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, కాలవల్లో కంపచెట్లు, గుర్రపు డెక్కల తొలగింపు వాటిపై సంబంధిత శాఖల అధికారులు వివరిస్తారని అన్నారు. 9న నీటి పారుదల శాఖ వారు చెరువులలో కంప చెట్లు, గుర్రపు డెక్కల తొలగింపు, సమతుల్య నీటి వినియోగం, కార్యాలయాల పరిశుభ్రత (గ్రామ స్థాయిలో) సంబంధిత అధికారులు రైతులకు వివరించనున్నట్లు తెలిపారు.

### కోత కోసి 20 రోజులు కావస్తున్నా..

## కొనుగోలు కేంద్రాలు లేవ్

### ✷రోడ్లపై కుప్పలుగా పోసి రైతులు పడి గాపులు కాస్తున్నారు✷ తక్షణం ఏర్పాటుచేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం ✷మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ధ్వజం ✷మెట్లకుంటలో రైతులతో కలిసి మహా ధర్నా

**కొడంగల్, (బొంరాస్‌పేట్)మే 3, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. ఆదివారం బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట గ్రామంలో రైతులకు మద్దతుగా మండల బీఆర్ఎస్ పార్టీ అద్యక్షులు కోట్ల యాదగిరి అధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఇలాకా అయన కొడంగల్‌లో రైతులు వరి కోత కోసి 20 రోజులు కావస్తున్నా నేటివరకు వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. ఆరుగాలం కష్టపడి అప్పు చేసి పండించిన వరి ధాన్యాన్ని అన్నదాత రోడ్లపై కుప్పలుగా పోసి పడి గాపులు కాస్తున్నారని అన్నారు. రైతు బంధు, రుణమాఫీ, రైతు బీమా, సకాలంలో ఎరువులు, విత్తనాలు ఏవి కూడా రేవంత్ సర్కార్ రైతులకు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. కేసీఆర్ హయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో రైతులకు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించేదని గుర్తుచేశారు.

**రుణమాఫీని నిరూపిస్తే బిఆర్ఎస్ పోటీ చేయదు**

సిఎం రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సంపూర్ణ రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయదని సవాల్ విసిరారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేడుతామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసుదన్‌యాదవ్, చాంద్‌పాషా, శేరి నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవిగౌడ్, లగచర్ల సురేష్, బండ శ్రీను, మహిపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్ మండలం మెట్లకుంటలో చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

## బైర్‌ఖాన్‌పల్లిలో అర్ధరాత్రి ఉద్రిక్తత

### అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

### స్థానికులను బెదిరించి వాహనాలను తరలించిన మాఫియా టీం

### పోలీసులకు సమాచారం ఇచ్చినా సకాలంలో రాలేదని ఆందోళకారుల ఆగ్రహం

**కేశంపేట, మే 3, ప్రభాతవార్త:** కేశంపేట మండలంలోని బైర్ ఖాన్‌పల్లి గ్రామంలో అక్రమ మట్టి రవాణా వ్యవహారం శనివారం అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి సమీ పంలో ఇలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అర్ధరాత్రి వేళ భారీగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను గుర్తించిన గ్రామస్థులు, పర్యావరణానికి వ్యవసాయ భూములకు నష్టం జరుగుతుందని ఆందోళనతో ముందుకు వచ్చి వాటిని అడ్డుకున్నారు. రాత్రి సుమారు 3:20 గంటలకు అత్యవసర నంబర్ 100కు సమాచారం ఇచ్చినప్పటికీ, పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు తెల్లవారుజామున 4 గంటల తర్వాత ఘటన స్థలానికి చేరుకోలేదని గ్రామస్థులు తెలిపారు. అదేసమయంలో మట్టి మాఫియాకు చెందిన కొందరు అక్కడికి చేరుకుని తమతో వాగ్వాదానికి దిగారని వివరించారు. ఉద్రిక్త పరిస్థితుల్లో బలవంతంగా మట్టి లోడ్ ఉన్న టిప్పర్లను అక్కడి నుంచి తరలించుకెళ్లినట్లు చెప్పారు.



బైర్‌ఖాన్‌పల్లి మీదుగా అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహానాలు(ఇన్‌సెట్)అర్ధరాత్రి గ్రామస్తులు అడ్డుకున్న వాహనం

మట్టి లోడ్ టిప్పర్లు వెళ్లిపోయిన తరువాత అక్కడ ఉన్న పోలీసులు ఖాళీ టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా తమపైనే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు గ్రామస్తులు మీడియాకు వివరించారు. ప్రజల భద్రత కాపాడాల్సిన పోలీసులే ఇలా ప్రవర్తించడం ఆందోళనకరంగా ఉందని వాపోయారు. మహేశ్వరం మండలంకు చెందిన మట్టి మాఫియా దర్జాగా షాద్‌నగర్ నియోజకవర్గంలో మట్టిని తరలించుకు పోతుంటే ఇక్కడి నాయకులు, కొందరు స్థానికులు వారి వద్ద డబ్బులు తీసుకుని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అక్రమ మట్టి రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

## ఇద్దరు మృతి

- ♦ చేవెళ్లలో కారు టైరు పగిలి ఒకరు..
- ♦ షాబాద్‌లో రోడ్డు దాటుతుండగా ఇంకొకరు..

**చేవెళ్ల, మే 3, ప్రభాతవార్త :** రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పామేన చౌరస్తా వద్ద ఆదివారం వెలుగుచూసింది. బాధిత కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం... మండల పరిధిలోని గుండాల పంచాయతీ పరిధిలోని లక్ష్మి గూడ గ్రామానికి చెందిన కొలను శ్రీశైలంరెడ్డికి ఒక కుమార దివాకర్ రెడ్డి(25) ఇద్దరు కూతుళ్లు, కొడుకు షార్ట్ ఫిలిమ్స్ తీస్తుంటాడు. రెండు రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటూ ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో దివాకర్ రెడ్డి తన షీఫ్ట్ కారులో చేవెళ్ల నుంచి ఇంటికి బయలు దేరాడు. పెట్రోల్ పంపు సమీపంలోకి రాగానే పామెన వైపు నుంచి చేవెళ్లకు వస్తున్న బ్రిజా కారు టైర్ పగిలి డివైడర్‌ను దాటి ఎదురుగా ఉన్న షీఫ్ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన దివాకర్ రెడ్డి కారులో ఇరుక్కుపోవడంతో స్థానికులు దొర్లు తెరిచి 108 వాహనంలో చేవెళ్ల ప్రభుత్వకి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. బ్రిజా కారులో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దివాకర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాన్ని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య ఒక బాబు ఉన్నాడు. ఇటీవలనే బాబు మొదటి సంవత్సరం పుట్టిన రోజు వేడుక జరిపారు. ఇంతలో అతడు మృతి చెందడంతో ఆకుటుంబంలో, గ్రాములో విషాదచాయలు అలుముకున్నారు.



చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దివాకర్ రెడ్డి (ఫైల్)

**కూరగాయలు తీసుకొని వెళ్తుండగా..**

**షాబాద్, మే 3, ప్రభాతవార్త :** రోడ్డు దాటుతుండగా డీసీఎం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి లో ఆదివారం చోటు చేసుకుంది. షాబాద్ ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు.. అస్సాం రాష్ట్రానికి చెందిన మనేష్ దాస్ (22) మల్లారెడ్డి గూడ గ్రామం వద్ద కంపెనీలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నాడు. కిరాణా దుకాణంలో కూరగాయలు తీసుకొని మనేష్ దాస్ రోడ్డు దాటుతుండగా చేవెళ్ల నుండి షాబాద్ వైపు వెళుతున్న డీసీఎం అతివేగంగా వచ్చి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు ఆకాష్ దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నేడు ప్రజా పాలనపై సమావేశం

**జిల్లెడు చౌదరిగూడ, మే 3, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో గల రైతు వేదికలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంపై సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చౌదరిగూడ , ఎదిర , పెద్ద ఎల్కిచర్ల గ్రామాలలో గల రైతు వేదికలలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పెర్కోన్నారు.

## పంట చేతికొచ్చినా.. చేలోనే!

### కొనుగోలు కేంద్రాలు లేక జొన్న రైతుల అగచాట్లు

### దిగుబడిని కల్లాల్లో ఆరబెట్టుకుంటున్నామని ఆవేదన

### అకాల వర్షం భయంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నామని వెల్లడి

### మద్దతు ధరలో కోతలు పెడుతున్నారని ఆందోళన

### జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి

**ధారూర్, మే 3, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రబీ సాగులో భాగంగా ఎంతో కష్టపడి జొన్న పంటను పండించామని, ప్రస్తుతం ఆ పంట కోత దశకు చేరుకుని చేతికి వచ్చిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దిగుబడిని కల్లాల్లో ఆరబెట్టుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం జొన్న పంటకు మద్దతు ధర క్వింటాలుకు రూ. 3,690గా నిర్ణయించినప్పటికీ, క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తమకు ఆ ధర దక్కడం లేదని వాపోయారు.

దీనిని ఆసరాగా చేసుకున్న దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి అతి తక్కువ ధరకే జొన్నలను కొనుగోలు చేస్తునానరని చెప్పారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రం లేక, వర్షాలు వస్తాయేమో అన్న భయంతో ఆందోళనతో ఉన్న తాము దళారులు అడిగిన ధరకే విక్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీనవల భారీగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ధారూర్ మండల కేంద్రంలో అధికారిక కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని ధారూర్ మండల బిఆర్ఎస్ (టిఆర్ఎస్) పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. తద్వారా రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర నేరుగా అందుతుందని, దళారీల దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు.



జొన్న పంటను పొలాల్లోనే ఎండబెడుతున్న రైతులు